సాక్షి
అన్నమయ్య జిల్లా

సోమవారం ၊ 14 ၊ ఏప్రిల్ ၊ 2025



భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం

క్రైస్తవుల ఆరాధ్య దైవం ఏసుక్రీస్తు ఆత్మబలి దానాన్ని సూచిస్తూ గుడ్‌ఫ్రైడే రాకను తెలుపుతూ జిల్లా వ్యాప్తంగా మట్టల ఆదివారాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



అధికార దర్పం ప్రదర్శిస్తే సహించేది లేదు

అధికార దర్పంతో ఏం మాట్లాడినా చెల్లుతుందన్నట్లుగా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి వ్యవహరించడం తగదని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి రమేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.110	రూ.140
రెండోరకం	రూ.80	రూ.110



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 201 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	-	-
సీబీ	655	655



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 140.600 కిలోలు

రామా.. కనుమా!

- అమ్మకానికి కల్యాణ ఉచితప్రసాదాలు
- బ్యాగ్‌లో కంకణం, ముత్యాల తలంబ్రాలు, లడ్డూ
- రాములోరి కల్యాణంలో మిగిలిన వాటికి భేరం
- రూ.50తో రామాలయం వద్ద విక్రయం
- అధికారుల నిర్ణయంపై భక్తుల పెదవి విరుపు



రామాలయం వద్ద ఉచిత ప్రసాద బ్యాగ్‌లను అమ్ముతున్న సిబ్బంది



టీటీడీ అమ్మిన కల్యాణ ఉచిత ప్రసాదాల బ్యాగ్

ఒంటిమిట్ట(రాజంపేట): ఒంటిమిట్ట రామాలయం ఆవరణలో ఆదివారం టీటీడీ అధికారులు ఉచిత ప్రసాదాలు.. అమ్మకాలు చేసిన నిర్వాహకం భక్తులను విస్మయానికి గురిచేసింది. రాములోరి కల్యాణానికి, బ్రహ్మోత్సవాలకు రూ.కోట్లు వెచ్చించిన టీటీడీ.. ఉచిత ప్రసాదాలు అమ్ముకునే దుస్థితిని చూసి భక్తలోకం నివ్వెరపోతోంది. ఈ ప్రసాదాలను అమ్ముతున్నట్లుగా భక్తులకు తెలిసే విధంగా సమాచారం కూడా ఇవ్వలేదు. అయితే రూ.50 లెక్కన రాములోరి ఉచిత కల్యాణ ప్రసాదాలను అమ్మకాలు కొనసాగించారు. దీంతో భక్తులు వాటిని కొనుగోలు చేసి తీసుకున్నారు. ఉచిత ప్రసాదాలను కూడా అమ్మి సొమ్ము చేసుకోవాలనే అధికారుల నిర్ణయంపై భక్తులు పెదవి విరిచారు. టీటీడీ పాలకమండలి ఛైర్మన్ బీఆర్ నాయుడు పాలనలో ఒంటిమిట్ట రామాలయంలో రాములోరి కల్యాణ ఉచిత ప్రసాదాలను అమ్మకున్న పరిస్థితులపై భక్తులు విమర్శలు చేస్తున్నారు.

రాములోరి కల్యాణంలో..

ఈ నెల 11న సీతారాముల కల్యాణోత్సవాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం వైభవంగా నిర్వహించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీసమేతంగా హాజరయ్యారు. రాములోరి కల్యాణానికి విచ్చేసిన భక్తులకు కల్యాణం అనంతరం చిన్న చిన్న బ్యాగులలో ఉచితంగా ప్రసాదాలను పంపిణీ చేశారు. ప్రసాదాల పంపిణీ సరిగ్గా జరగలేదన్న విమర్శలు అప్పుడే భక్తుల నుంచి వినిపించాయి.

ఉచిత ప్రసాదం బ్యాగులో..

రాములోరి కల్యాణం సందర్భంగా భక్తులకు ఉచితంగా అందజేసిన ఉచిత ప్రసాదం బ్యాగులో కంకణం, లడ్డూ, రెండు ముత్యాల తలంబ్రాలు ప్యాకెట్‌లు ఉన్నాయని భక్తులు అంటున్నారు. కల్యాణంలో మిగిలిపోయిన ఉచిత ప్రసాద బ్యాగుల అమ్మకంపై స్థానిక సూపరింటెండెంట్ హనుమంతయ్యను 'సాక్షి' వివరణ కోరగా.. రూ.50లకు రామాలయం వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్‌లో ఇస్తున్నారన్నారు. జేఈవో ఆదేశాల మేరకు ఉచిత ప్రసాదాలను రూ.50 లెక్కన విక్రయిస్తున్నామని వెల్లడించారు.

దాదాపు 10వేలకు పైగా..

దాదాపు 10వేలకు పైగా ఉచిత ప్రసాద బ్యాగులు మిగిలిపోయాయని టీటీడీ అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ నెల 12న ఉదయం 10 గంటల వరకు ముఖ్యమంత్రి టీటీడీ అతిథి గృహంలో బస చేశారు. సీఎం వెళ్లిపోయిన తర్వాత ఉచితప్రసాదాల అమ్మకాలకు టీటీడీ అధికారులు సిద్ధమయ్యారు. టీటీడీ జేఈవో వీరబ్రహ్మం ఆదేశాలతోనే అధికారులు ఉచిత ప్రసాదాలను అమ్ముతున్నట్లుగా టీటీడీ వర్గాల్లో ప్రచారం కొనసాగుతోంది.

వైభవంగా కమలాపురం ఉరుసు



దర్గా-ఏ-గఫారియాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న అంజద్ బాషా, నరేన్ రామాంజులరెడ్డి తదితరులు

- భక్తులతో కళకళలాడిన దర్గా ప్రాంగణం
- అలరించిన ఖవ్వాలీ పోటీ

కమలాపురం: కమలాపురం పట్టణంలో వెలసిన హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి, హజరత్ మౌలానా మౌల్వి ఖాదర్ మొహిద్దీన్ షా ఖాద్రి, హజరత్ జహీరుద్దీన్ షా ఖాద్రి ఖుద్దస సిర్రహుం వార్ల ఉరుసు మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. మూడు రోజులుగా జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రధాన ఉరుసు మహోత్సవం భక్తుల కోలాహలం నడుమ వైభవంగా జరిగింది. రాష్ట్రం నలు మూలల నుంచే కాక తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుంచి ముస్లిం, హిందు భక్తులు పెద్ద సంఖ్యలో ఉరుసు మహోత్సవానికి తరలివచ్చారు. భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న ఈ దర్గాకు కులమతాలకు అతీతంగా భక్తులు వేలాదిగా తరలి రావడంతో దర్గా ఆవరణం కిటకిటలాడింది. భక్తులు దర్గాలోని స్వామి వారి మజార్లపై పూల చాదర్‌లు సమర్పించి చెక్కెర చదివింపులు చేశారు. పీఠాధిపతి మహమ్మద్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రిని భక్తులు గౌరవ పూర్వకంగా కలిసి ఆశీర్వాదం పొందారు. జాయింట్ వీల్స్, బ్రేక్ డ్యాన్స్, తదితర రంగుల రాట్నాల వద్ద పిల్లల సందడి కనిపించింది.

- దర్గా ఆవరణలో ఏర్పాటు చేసిన ఖవ్వాలి పోటీ ఆద్యంతం అలరించింది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఢిల్లీకి చెందిన ఖుతబ్ బ్రదర్స్, యూపీ కి చెందిన సర్ఫరాజ్ అన్వర్ సాబిరి ల మధ్య వేకువ జాము వరకు ఖవ్వాలీ పోటీ ఉత్సాహ భరితంగా సాగింది. ఖవ్వాలి విన్న ఖవ్వాలి ప్రేమికులు పాటలను వింటూ, మజా చేస్తూ ఖుషీ ఖుషీగా నజరానా సమర్పించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల ప్రత్యేక ప్రార్థనలు

కమలాపురంలో వెలసిన దర్గా-ఏ-గఫారియా, జహీరియా ఉరుసు మహోత్సవాల్లో భాగంగా వైఎస్సార్ సీపీ నాయకులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆదివారం రాత్రి దర్గా కన్వీన ఇస్మాయిల్ ఆహ్వానం మేరకు మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా, వైఎస్సార్ సీపీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ నరేన్ రామాంజులరెడ్డి దర్గా చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్వామి వారి మజార్లపై చాదర్లు సమర్పించి ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు. పీఠాధిపతి ఆశీస్సులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

ఉరుసును పురస్కరించుకుని నిర్వహించిన రాష్ట్రస్థాయి బండలాడుగు పోటీలు రసవత్తరంగా సాగాయి. జిల్లా నుంచే కాక ఇతర జిల్లాల నుంచి వచ్చిన 11 కాండ్ల జతల ఎడ్లు పోటీలో తలపడ్డాయి. ప్రొద్దుటూరుకు చెందిన బీసీఎస్ఆర్ బుల్స్ అధినేత వెంకటసాయి భవిత్‌రెడ్డి ఎడ్లు 5107 అడుగులు లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. నంద్యాల జిల్లా పెద్ద కొట్టాలకు చెందిన నారాయణరెడ్డి ఎడ్లు 4694 అడుగులతో ద్వితీయ స్థానంలో, దువ్వూరు మండలం దాసరిపల్లెకు చెందిన టి.అశోక్ ఎడ్లు 4600 అడుగులతో తృతీయ స్థానంలో, కమలాపురం మండలం జంగంపల్లెకు చెందిన నాగ సుబ్బారెడ్డి ఎడ్లు 4470 అడుగులతో నాల్గవ స్థానంలో నిలిచాయి. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

కాళీయమర్దనుడిగా కోదండ రాముడు

ఒంటిమిట్ట: ఏకశిలానగరిలో కొలువైన కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఎనిమిదో రోజైన ఆదివారం ఉదయం కాళీయమర్దన అలంకారంలో జగదభిరాముడిని ముస్తాబు చేశారు. పట్టు వస్త్రాలు, పుష్పమాలికలు, ఆభరణాలతో అందంగా అలంకరించారు. ఉదయం 7:30 నుంచి 9:30 గంటల వరకు స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. భజన బృందాలు భజనలు, కోలాటాలు ఆడుతుండగా స్వామి వారు గ్రామ వీధుల్లో విహరించారు. అనంతరం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు స్నపనతిరుమంజనం వేడుకగా జరిగింది. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనంతో శ్రీ సీతాలక్ష్మణ సమేతుడైన కోదండ రామ ఉత్సవమూర్తులకు విశేషంగా అభిషేకం చేశారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఊంజల్ సేవ వైభవంగా నిర్వహించారు.

అశ్వవాహనంపై ఒంటిమిట్ట విభుడు

రాత్రి 7 నుంచి 8:30 గంటల వరకు అశ్వ వాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉపనిషత్తులు ఇంద్రియాలను గుర్రాలుగా వర్ణిస్తున్నాయి. అందువల్ల అశ్వాన్ని అధిరోహించిన పరమాత్మ ఇంద్రియాలను నియమించే నియామకుడు. పరమాత్ముడు అశ్వ స్వరూపంగా కృష్ణయజుర్వేదం తెలియజేసింది. స్వామి అశ్వవాహనాదిరూఢుడై భక్తులకు దర్శనమిచ్చి తద్వారా తన కల్కి స్వరూపాన్ని ప్రకటిస్తూ కలిదోషాలకు దూరంగా ఉండాలని నామ సంకీర్తనాద్యుపాయాలను ఆశ్రయించి, తరించాలని ప్రబోధిస్తున్నాడు.

నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజైన శనివారం ఉదయం 9 నుంచి 10:30 గంటలకు చక్రస్నానం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. సాయంత్రం 7 నుంచి రాత్రి 8 గంటలకు ధ్వజావరోహణం ఉంటుందని ఆలయ డిప్యూటీ ఈవో నటేష్ బాబు తెలిపారు.



మాడ వీధుల్లో కాళీయమర్దనుడి ఊరేగింపు

న్యూస్‌రీల్

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

రాయచోటి టౌన్: బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని అర్జీదారులు, ప్రజలు గమనించాలని ఆయన కోరారు. తమ వినతి పత్రాలు సమర్పించేందుకు కలెక్టరేట్‌కు రావద్దని సూచించారు.

జీపీకేఎల్‌లో రాయచోటి వాసి



అలీ అహమ్మద్

రాయచోటి జగదాంబసెంటర్: రాయచోటి పట్టణం బోస్‌నగర్‌కు చెందిన అలీ అహమ్మద్(22) ఈ నెల 18, 19, 20వ తేదీల్లో ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించే కబడ్డీ జీపీకేఎల్(గ్లోబల్ ఇండియా ప్రవాసి కబడ్డీ లీగ్)లో లయన్స్ తమిళ్ టీం తరపున ఆడనున్నారు. ఈయన రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పట్టా పొందారు. అలీఅహమ్మద్ చిన్ననాటి నుంచే కబడ్డీ ఆట ఆడాలనే లక్ష్యంతో ముందుకు వెళ్లేవాడని అతని తండ్రి షబ్బీర్ తెలిపారు. విద్యతోపాటు క్రీడా రంగంలో రాణించిన ఆ యువకుడికి రాయచోటి, జిల్లా ప్రజలు అభినందనలు తెలుపుతున్నారు. రానున్న రోజులలో అంతర్జాతీయ క్రీడలలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఈ ప్రాంతానికి, జిల్లాకు, రాష్ట్రానికి మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో తనిఖీలు



రోళ్లబోడు బీటులో తనిఖీలు నిర్వహిస్తున్న డీఎఫ్‌ఓ వినీత్‌కుమార్

సిద్దవటం: సిద్దవటం ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని గొల్లపల్లె, రోళ్లబోడు, సిద్దవటం బీట్లలోని సమస్యాత్మక ప్రాంతాల్లో కడప డీఎఫ్‌ఓ వినీత్‌కుమార్ ఆదివారం తనిఖీలు చేపట్టారు. అనంతరం రోళ్లబోడు బేస్ క్యాంప్ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ సంపద తరలిపోకుండా సమస్యాత్మక ప్రాంతాల్లో తరచూ తనిఖీలు చేపట్టాలని పేర్కొన్నారు. ఫారెస్టు చెక్‌పోస్టు వద్ద రాత్రి వేళల్లో అప్రమత్తంగా ఉండి వాహనాలు తనిఖీలు చేయాలన్నారు. అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల పట్ల వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని నీటి తొట్లలో తాగునీరు నింపాలన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దవటం రేంజర్ బి.కళావతి, డీఆర్‌ఓ ఓబులేష్, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీలో కుమ్ములాట

- రైల్వేకోడూరులో తారా స్థాయికి విభేదాలు
- రాజంపేటలో నేతల మధ్య వర్గ పోరు
- రాయచోటిలో మంత్రి, సుగవాసిల మధ్య పెరిగిన దూరం
- తంబళ్లపల్లెలో కుదరని సమన్వయం
- ఇన్‌చార్జి మంత్రికి తప్పని తమ్ముళ్ల తలనొప్పి



రైల్వేకోడూరులో ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఎదుట నినాదాలు చేస్తున్న టీడీపీలో ఓ వర్గం నేతలు, కార్యకర్తలు (ఫైల్)

సాక్షి రాయచోటి: సార్వత్రిక ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారులో ఆధిపత్య పోరు మొదలైంది. నియోజకవర్గాల్లో అధికార పార్టీ ఇన్‌చార్జిగా ప్రకటించిన నేతకు బాగా పలుకుబడి ఉంటుందన్న కారణంతో పోరు సాగుతోంది. ఎన్నికల ముందు అంతంత మాత్రంగా ఉన్నా... అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టు కోసం ఒకరిపై మరొకరు ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నారు. మరో పక్క ఆర్థికంగా బలపడేందుకు.. అధికారులతో పని చేయించుకునేందుకు పదవి అన్నది కీలకంగా మారింది. దీంతో ఇంతకు మునుపు వరకు కలిసికట్టుగా ఉన్న నేతల్లో.. ఒకరంటే మరొకరికి పడని పరిస్థితి నెలకొంది. అధిష్టానం మాత్రం ఓడిపోయిన నియోజకవర్గాల్లో ఇంతవరకు ఇన్‌చార్జిలను కూడా ప్రకటించలేని దుస్థితిలో ఉండగా.. తమ్ముళ్ల మధ్య తగువులాటలు యథా రాజా.. తథా ప్రజా అన్నట్లుగా జరుగుతున్నాయి. రెండు రోజుల కిందట రైల్వేకోడూరు, రాజంపేటలో జరిగిన సమన్వయ కమిటీ సమావేశాల్లో కూడా జిల్లా ఇన్‌చార్జి మంత్రి జనార్దన్‌రెడ్డి ఎదుటే తమ్ముళ్లు యుద్ధ చేయడంతో ఆయన తల పట్టుకోవాల్సి వచ్చింది.

రూపానందరెడ్డి తీరుపై ప్రత్యర్థి వర్గం బహిరంగ యుద్ధం

జిల్లాలోని రైల్వేకోడూరు నియోజకవర్గంలో అధికార పార్టీ టీడీపీలో కుమ్ములాటలు తారా స్థాయికి చేరాయి. ఎన్నికలకు ముందు టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న కస్తూరి విశ్వనాథనాయుడును పక్కనపెట్టి.. వైఎస్సార్‌సీపీ నుంచి వచ్చిన రూపానందరెడ్డికి టీడీపీ ఇన్‌చార్జిగా అధిష్టానం పట్టం కట్టింది. అంతేకాకుండా అధికారంలోకి రాగానే రూపానందరెడ్డికి అడ చైర్మన్‌గా అవకాశం ఇస్తూ పెద్దపీట వేశారు. మరో పక్క ఎన్నికల్లో జనసేన అభ్యర్థి గెలుపు కోసం పని చేసిన విశ్వనాథనాయుడుతోపాటు మాజీ ఎమ్మెల్సీ చెంగల్రాయులును పట్టించుకునే పరిస్థితి లేకపోవడంతో కార్యకర్తలు రగలిపోతున్నారు. ఆది నుంచి పార్టీ కోసం పని చేసిన వారిని కాకుండా.. కొత్తగా వచ్చిన వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తున్నారంటూ వర్గాలు యుద్ధ వాతావరణం సృష్టించాయి. రైల్వేకోడూరు నియోజకవర్గంలో జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఉన్నా.. పెత్తనమంతా రూపానందరెడ్డి కుటుంబమే చేస్తున్నదని రగలిపోతున్న ప్రత్యర్థి వర్గాలు ఇన్‌చార్జి మంత్రిని చూడగానే రెచ్చిపోయాయి. మాజీ ఇన్‌చార్జితోపాటు మాజీ ఎమ్మెల్సీలకు ప్రాధాన్యత తగ్గించడంపై పార్టీ శ్రేణులు మంత్రి ఎదుటే దాడికి దిగారు. టీడీపీ కార్యాలయంలోని అద్దాలతోపాటు కుర్చీలు, ఇతర సామగ్రిని ధ్వంసం చేశారు. అంతేకాకుండా టీడీపీ సమన్వయ కమిటీ సమావేశానికి జనసేన తరపున గెలిచిన ఎమ్మెల్యే శ్రీధర్ రావడాన్ని కూడా తీవ్ర స్థాయిలో ప్రత్యర్థి వర్గాలు ఆక్షేపించాయి. రైల్వేకోడూరు టీడీపీలో మూడు వర్గాల మధ్య ప్రచ్ఛన్నయుద్ధం పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితికి వచ్చింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలోనే తీవ్ర స్థాయిలో వాదోపవాదాలు, తోపులాట పరిస్థితి చూసిన ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు.

తంబళ్లపల్లెలో ఇన్‌చార్జి రగడ

జిల్లాలోని తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఇద్దరు నేతల మధ్య ఇన్‌చార్జి వ్యవహారం రగులుతోంది. ఒకపక్క మొన్నటి ఎన్నికల్లో పోటీ చేసిన జయచంద్రారెడ్డి.. ఆది నుంచి పార్టీ కోసం పని చేసిన మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్ వర్గాల మధ్య రచ్చ ముదిరింది. ఇటీవల ములకలచెరువు, తంబళ్లపల్లె, బి.కొత్తకోట ప్రాంతాల్లో వర్గాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొని మంత్రి లోకేష్ బ్యానర్లు, ఫ్లెక్సీలు ఎక్కడికక్కడ ఒక వర్గం చింపివేసి కేకులను విసిరి కొట్టారు. లోకేష్ జన్మదినం సందర్భంగా రెండు వర్గాల మధ్య ముష్టి యుద్ధం చోటుచేసుకుంది. ఇలాంటి విపత్కర పరిస్థితులు చోటుచేసుకుంటున్నా తంబళ్లపల్లెను మాత్రం అధిష్టానం గాలికి వదిలివేయడంపై కార్యకర్తలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. మదనపల్లెలో కూడా ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా టీడీపీలోని కొన్ని వర్గాలు పని చేస్తున్నాయి. ఏదిఏమైనా అన్ని నియోజకవర్గాల్లో కూటమిలో కుమ్ములాటలు తారాస్థాయికి చేరాయి.



రైల్వేకోడూరు టీడీపీ కార్యాలయం అద్దాలు ధ్వంసం చేసిన ఓ వర్గం కార్యకర్తలు (ఫైల్)

రాజంపేటలో రచ్చరచ్చ

రాజంపేట టీడీపీలో వర్గ విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. ఒకవైపు జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు, మరోవైపు గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన సుగవాసి బాలసుబ్రమణ్యం వర్గాల మధ్య పోటాపోటీ పరిస్థితులు నెలకొన్నాయి. రాజంపేటలో గత ఆగస్టులో అన్నా క్యాంటీన్ ప్రారంభోత్సవ సందర్భంగా రిబ్బన్ కత్తిరించే విషయంలో కీలక నేతలైన జగన్‌మోహన్‌రాజు, బాలసుబ్రమణ్యంలు తోసుకోవడంతో .. అప్పటి నుంచి కార్యకర్తల్లో కూడా భేదాభిప్రాయాలు తీవ్ర స్థాయిలో వచ్చాయి. ఇన్‌చార్జి మంత్రి సమక్షంలో జరగాల్సిన టీడీపీ సమన్వయ కమిటీ సమావేశంలోనూ వర్గాలుగా విడిపోయిన కార్యకర్తలు యుద్ధం చేశారు. ఒక పక్క టీడీపీ ఇన్‌చార్జిగా రాజంపేట నుంచి పోటీ చేసిన బాలసుబ్రమణ్యంకు అప్పగించాలని పలువురు డిమాండ్ చేశారు. మరోపక్క జగన్‌మోహన్‌రాజు వర్గం నేతలను మాత్రమే లోపలికి అనుమతిస్తున్నారంటూ ప్రత్యర్థి వర్గం ఆగ్రహం వ్యక్తం చేసింది. కార్యకర్తలు అందరూ లోపల ఉండాల్సిందేనంటూ ఒకరునొకరు తోసుకోవడంతో రాజంపేటలోనూ గందగోళ పరిస్థితులు నెలకొన్నాయి. అయితే కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి పది నెలలు దాటుతున్నా.. ఇప్పటికీ ఇన్‌చార్జిని నియమించలేక అధిష్టానం సాగదీస్తోంది.

రాయచోటిలో రగులుతున్న అసమ్మతి

అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలోని కీలక నేతల మధ్య దూరం పెరిగింది. ప్రస్తుత రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న రాయచోటిలో మాజీ ఎంపీ సుగవాసి పాలకొండ్రాయుడు కుమారులకు ప్రాధాన్యత తగ్గించారని ఆ వర్గం రగిలిపోతోంది. రాజంపేటలో పోటీ చేసిన సుగవాసి బాలసుబ్రమణ్యం తర్వాత మంత్రిపై పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు చేశారు. అప్పటి నుంచి సుగవాసి, మండిపల్లి మధ్య దూరం పెరిగింది. అంతేకాకుండా ఇటీవల ముఖ్యమంత్రి సంబేపల్లెకు వచ్చిన సందర్భంలోనూ బాలసుబ్రమణ్యం కలిసేందుకు ప్రొటోకాల్ లిస్టులో పేరు లేకుండా చేశారని ఆ వర్గం ఆందోళన వ్యక్తం చేసింది. అంతేకాకుండా ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలకు కూడా ఆహ్వానం లేనట్లు తెలుస్తోంది. మరోపక్క అన్నకు జరుగుతున్న అవమానాలపై టీడీపీ సీనియర్ నాయకుడిగా ఉన్న ప్రసాద్‌బాబు కూడా తీవ్ర అసహనంతో ఉన్నారని తెలుస్తోంది. రాయచోటిలో కూడా అటు మండిపల్లి, ఇటు సుగవాసి కుటుంబాల మధ్య పొరపచ్చాలు రావడంతో కార్యకర్తలు కూడా వర్గాలుగా విడిపోయారు.

తన్నుకున్న తమ్ముళ్లు

- మంత్రి సమక్షంలో జేసీఆర్, శంకర్ వర్గాల బలప్రదర్శన



హార్సిలీహిల్స్‌పై బాహాబాహీకి దిగిన ఇరు వర్గాలు

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలంలోని చల్లనికొండ హార్సిలీహిల్స్‌పై టీడీపీ తమ్ముళ్ల మధ్య డిష్యూం డిష్యూం ఉద్రిక్తతకు దారితీసింది. మంత్రి సమావేశంలో ఉండగానే.. వెలుపల ఇరువర్గాలు ఉద్రిక్తత సృష్టించేలా వ్యవహరించడం మంత్రికి చిరాకు తెప్పించడంతో సమావేశం నుంచి అర్థాంతరంగా వెళ్లిపోయారు. ఆదివారం రహదారి భవనాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి నిర్వహించిన టీడీపీ నేతల సమావేశం సందర్భంగా.. మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జయచంద్రరెడ్డి వర్గాలు బాహాబాహీకి దిగాయి. ఎంపిక చేసిన నాయకులతో సమావేశం ఉంటుందని ముందుగా చెప్పిన నిర్ణయం మార్చుకుని.. మండలాల వారీగా అందరికీ అవకాశం కల్పించడంతో పరిస్థితి గందరగోళానికి దారితీసింది.

కేఎస్ఎస్‌ల నియామకం పార్టీ చూసుకుంటుందని చెప్పిన మంత్రి

హార్సిలీహిల్స్‌పై ఆరు మండలాలకు చెందిన మండల కన్వీనర్లు, ప్రధాన కార్యదర్శులు, బూత్ ఇన్‌చార్జ్‌లు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించారు. సమావేశం నిర్వహించిన ఓ ప్రయివేటు సమావేశ హాలులో మంత్రి జనార్దన్‌రెడ్డి, జోన్‌పోర్ ఇన్‌చార్జ్ దీపక్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, పరిశీలకుడు గురువారెడ్డి హాజరయ్యారు. దీనికి ముందు జయచంద్రారెడ్డి వర్గంతో ప్రత్యేకంగా సమావేశమై సమస్యలు తెలుసుకుంటామని చెప్పారు. తర్వాత ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డిని ఈ సమావేశానికి దూరంగా పెట్టారు. తొలుత పెద్దమండ్యం మండల నేతల సమావేశంలో కన్వీనర్ బిల్డర్ రమణ పార్టీలో కష్టపడి పని చేసినా గుర్తింపులేదని, తమను ఇన్‌చార్జ్ పట్టించుకోవడం లేదంటూ ఏకరువు పెట్టారు. మిగిలిన కొందరు నాయకులు ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. తర్వాత తంబళ్లపల్లె మండల సమావేశంలో రెండు వర్గాలు పరస్పరం ఆరోపణలు చేసుకున్నాయి. ములకలచెరువు సమావేశంలో కన్వీనర్ పాలగిరి సిద్దా తమ ఇబ్బందులపై ఏకరువు పెట్టారు. అందులో కేఎస్ఎస్ సభ్యుల ప్రస్తావన చేయడంతో.. ఈ నియామక ప్రక్రియను పార్టీ చూసుకుంటుందని, ఇందులో ఎవరి ప్రమేయం ఉండదని మంత్రి స్పష్టం చేశారు. శంకర్ వర్గీయులు ఇచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. ఇలా సమావేశం జరుగుతుండగా వెలుపల భారీసంఖ్యలో రెండు వర్గాలు మోహరించి ఉన్నాయి. హాలు వద్ద రెండు వర్గాలు ఎదురెదురుగా ఉండటంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ సందర్భంగా శంకర్ వర్గీయులు తాము పార్టీకి కష్టపడి పని చేశామని, గుర్తింపు లేదని దీపక్‌రెడ్డికి మొరపెట్టుకున్నారు. అంతలో రెండు వర్గాలు అరుపులు, కేకలు, ఈలలు వేయడంతో ఒక్కసారి రెండు వర్గాలకు తలపడే పరిస్థితి రావడంతో పోలీసులు అప్రమత్తం అయ్యారు. ఈ పరిస్థితిపై అసహనానికి గురైన మంత్రి జనార్దన్‌రెడ్డి అందరినీ ఆహ్వానిస్తే ఇలా వ్యవహరించడం తగదు అంటూ మిగిలిన బి.కొత్తకోట, కురబలకోట, పెద్దతిప్పసముద్రం మండలాల సమావేశాలను రద్దు చేసుకుని బయటకు వచ్చేశారు. సమావేశం నుంచి మంత్రి బిరాబిరా వెళ్లిపోయారు. వెళ్తున్నట్టు కానీ, సమావేశాలు ముగించామని గానీ చెప్పలేదు. అందరి అభిప్రాయాలను కూడా తెలుసుకోలేదు. ఆయనతోపాటు మిగిలిన నేతలు హార్సిలీహిల్స్ నుంచి వెళ్లిపోయారు.

మంత్రి నిర్ణయమే కారణం

తంబళ్లపల్లె నియోజకవర్గం నుంచి సమావేశానికి వచ్చే పార్టీ నాయకుల జాబితాను పోలీసులకు అందజేశారు. అందులో 26 మందికి మాత్రమే ఆహ్వానాలు అందాయి. వీరిని మాత్రమే హార్సిలీహిల్స్‌కు పంపాల్సి ఉండగా పోలీసులు ఇదే పని చేశారు. కొండ కింద అనుమతి లేని వారిని నిలిపివేశారు. అయితే మంత్రి జనార్దన్‌రెడ్డి అందర్నీ పంపండని, వారిని తనిఖీ కూడా చేయెద్దు అంటూ పోలీసులను ఆదేశించారు. దీనితో కొండ కింద నుంచి, సమావేశానికి హాజరయ్యే నేతల విషయంలో పోలీసులు జోక్యం చేసుకోలేదు. ఈ వ్యవహారం రెండు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది.

మాజీ జెడ్పీటీసీపై దాడి

మంత్రి వెళ్లగానే రెండు వర్గాలు మళ్లీ కేకలు, అరుపులతో ఒకరిపై ఒకరు తలపడ్డారు. అతిథి గృహ ప్రాంగణం నుంచి నెట్టుకుంటూ చేతులతో కొట్టుకుంటూ రోడ్డుపైకి వచ్చారు. అక్కడ శంకర్ వర్గీయుడు మాజీ జెడ్పీటీసీ ఈశ్వరప్ప ఉండగా జయచంద్రారెడ్డి వర్గీయులు ఆయనపై దాడి చేశారు. కొందరు రోడ్డుపై పడగా, మరికొందరు పక్కనే ఉన్న ముళ్లపొదల్లో పడ్డారు. ఇరు వర్గాలకు చెందిన కొందరికి గాయాలయ్యాయి. అక్కడే ఉన్న పోలీసులు వీరిని వారిస్తూ చెదరగొట్టారు. తర్వాత శంకర్ వర్గీయులు సెరికల్చర్ కేంద్రం వద్ద ఆందోళనకు సిద్ధమవుతుండగా డీఎస్పీ మహేంద్ర, పోలీసులు వారిని పంపించి వేశారు.

పోలీసులకు ఫిర్యాదు

హార్సిలీహిల్స్‌పై సమావేశానికి వచ్చిన తనపై దాడి చేసి కులం పేరుతో దూషించారని పెద్దతిప్పసముద్రం మాజీ జెడ్పీటీసీ, శంకర్ వర్గీయుడు ఈశ్వరప్ప బి.కొత్తకోట పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. మంత్రి, నాయకులను కలిసి వస్తుండగా ప్రయివేటు అతిథిగృహం వద్ద అంగడోళ్లపల్లెకి చెందిన కొండ్రెడ్డి అశోక్, మరి కొందరు కాపుకాచి కాలర్ పట్టుకుని షర్టు చించి కింద పడేసి కాళ్లతో తన్నారని, కులం పేరుతో తిడుతూ ఎక్కడైనా కనిపిస్తే అంతు చూస్తామని బెదిరించారన్న ఫిర్యాదును ఏఎస్ఐ భాస్కర్‌నాయక్‌కు అందజేశారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

హత్యకేసులో పోలీసుల నిర్లక్ష్యం

- బాధితుల రాస్తారోకో
- ఎఫ్ఐఆర్ తప్పులతడకగా ఉందంటూ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం
- మృతదేహాన్ని అప్పగించలేదని కుటుంబ సభ్యుల నిరసన
- ఎట్టకేలకు ఎమ్మెల్యే జోక్యంతో సద్దుమణిగిన వివాదం



పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించిన మనోహర్‌ను అడ్డుకున్న పోలీసులు



పోలీసుల తీరుకు నిరసనగా బెంగళూరు రోడ్డుపై బైఠాయించిన బాధితులు

మదనపల్లె : ఆటోలో ఎక్కిన వృద్ధురాలిని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి ఆటో డ్రైవర్ హత్యచేసిన కేసులో పోలీసులు ఎఫ్ఐఆర్‌ను తప్పులతడకగా రూపొందించడమే కాకుండా, మృతదేహానికి పోస్టుమార్టం చేయడంలో నిర్లక్ష్యం చూపడంపై బాధిత కుటుంబ సభ్యులు రోడ్డెక్కారు. తాలూకా పోలీస్ స్టేషన్ సమీపంలోని బెంగళూరు రోడ్డుపై బైఠాయించి వాహనాలను కదలనీయకుండా నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా రావాలంటూ నినాదాలు చేస్తూ, పోలీసులకు వ్యతిరేకంగా గళమెత్తారు. హత్యకేసును పోలీసులు ఉద్దేశపూర్వకంగా నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్నారంటూ హత్యకు గురైన వృద్ధురాలి మనవడు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. దీంతో పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు తక్షణమే యువకుడిని అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు తెలిపిన వివరాలు..శనివారం ఉదయం చంద్రాకాలనీ లక్ష్మీనగర్‌కు చెందిన వృద్ధురాలు గంగులమ్మ(73) వరుసకు కుమారుడైన వెంకటరమణ తిరుపతి ఆస్పత్రిలో చికిత్స పొందుతుంటడంతో, వైద్యచికిత్స నిమిత్తం అవసరమైన రూ.2లక్షలు తీసుకుని ఇంటి నుంచి బయలుదేరి మెయిన్‌రోడ్డుకు చేరుకుంది. అదేసమయంలో ఎగువకురవంక భవానీ నగర్‌కు చెందిన విష్ణువర్ధన్ ఆటోలో అటువైపుగా రావడంతో గంగులమ్మ ఆటోను ఆపింది. ఆర్టీసీ బస్టాండుకు వెళ్లాలని, తన కొడుకు వైద్యచికిత్సకు డబ్బులు తీసుకెళుతున్నానని, తొందరగా తీసుకెళ్లాల్సిందిగా కోరింది. గంగులమ్మ వద్ద డబ్బులు ఉన్న విషయంతోపాటు ఆమె ఒంటిపై నగలు ఉండటంతో విష్ణువర్ధన్ దుర్బుద్ధితో ఆమెను బైపాస్‌మీదుగా నిమ్మనపల్లె సర్కిల్ రామాచార్లపల్లె చెరువు మొరవ సమీపంలోకి తీసుకెళ్లాడు. అప్పటికే ఆటోలో ఉన్న ఇద్దరు వ్యక్తుల సహాయంతో పథకం ప్రకారం గంగులమ్మను హత్య చేసి ఆమెవద్ద ఉన్న నగదు, నగలను కాజేసి, వారిద్దరినీ అక్కడి నుంచి పంపేశాడు. గంగులమ్మ ప్రమాదవశాత్తు ఆటోలో నుంచి పడిపోయి చనిపోయిందంటూ ఆటో డ్రైవర్ విష్ణువర్ధన్ కట్టుకథ అల్లాడు. వృద్ధురాలి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులకు డ్రైవర్ విష్ణువర్ధన్ ప్రవర్తనపై అనుమానం రావడం, గంగులమ్మ తల, ఒంటిపై తీవ్రగాయాలు, రక్తస్రావం ఉండటంతో అనుమానంతో పోలీసులకు సమాచారం అందించారు. డ్రైవర్ విష్ణువర్ధన్‌ను పోలీసులకు అప్పగించారు. మృతదేహాన్ని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే కేసు నమోదుకు సంబంధించి పోలీసులు రాత్రి వరకు తర్జనభర్జనలు పడటం, కేసులో ఎక్కడా నగలు, నగదు గురించి ప్రస్తావించకపోవడం, ఆటో డ్రైవర్‌తో ఐదు రూపాయల చిల్లర కోసం జరిగిన గొడవలో హత్య జరిగిందని నిర్ధారించారు. ఈలోపు బాధితులు ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను కలిసి తమకు న్యాయం చేయాల్సిందిగా కోరారు. ఆయన స్టేషన్‌కు వెళ్లండి. నేను ఫోన్ చేస్తానని చెప్పారు. దీంతో బాధితులు స్టేషన్‌కు చేరుకుంటే, పోలీసులు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడమే కాకుండా పరుష పదజాలంతో తిట్టారు. ఎమ్మెల్యేకు చెబితే పనులు చకచకా జరిగిపోతాయా...స్టేషన్ నుంచి బయటకు వెళ్లండంటూ గదమాయించారు. ఉదయం 4 గంటలకు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న కుటుంబ సభ్యులు శవపంచనామా త్వరగా పూర్తిచేసి మృతదేహాన్ని అప్పగించాలని పోలీసులను కోరితే, ఇంత పొద్దున్నే ఎందుకు వచ్చారు. మధ్యాహ్నం తర్వాత భోజనం చేసుకుని రండంటూ సమాధానమిచ్చారు. దీంతో ఆగ్రహించిన కుటుంబ సభ్యులు పోలీసుల తీరును నిరసిస్తూ బెంగళూరు రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. దీంతో రూరల్, టూటౌన్ సీఐలు సత్యనారాయణ, రామచంద్ర, ఎస్ఐలు అన్సర్‌బాషా, గాయత్రిలు అక్కడకు చేరుకుని సర్ది చెప్పేందుకు ప్రయత్నించారు. అయితే వారు వినకుండా ఎమ్మెల్యే వచ్చి సమస్యను పరిష్కరించాలని పోలీసులతో గొడవకు దిగారు. ఇంతలో గంగులమ్మ మనుమడు మనోహర్ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించడంతో, పోలీసులు తక్షణమే అతడిని అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అక్కడకు చేరుకుని బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. చులకనగా మాట్లాడిన పోలీసులపై చర్యలు తీసుకుంటామని, కేసు విషయంలో న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో పాటు పోస్టుమార్టం త్వరగా జరిగేలా చర్యలు తీసుకోవడంతో నిరసన విరమించారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రభుత్వ ఆస్పత్రి పోస్టుమార్టం గది వద్దకు చేరుకుని గంగులమ్మ మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం పూలమాల వేసి నివాళులు అర్పించారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

క్లుప్తంగా

రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని యువకుడి మృతి



రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని ఉప్పరపల్లి రైల్వేగేటు వద్ద గుర్తు తెలియని యువకుడు(25) ఆదివారం రేణిగుంటవైపు వెళ్తున్న రైలు నుంచి జారి పడి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు రేణిగుంట రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య



జాఫర్‌హుస్సేన్ (ఫైల్)

మదనపల్లె : ఒంటరి జీవితంపై విరక్తి చెంది వృద్ధుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం పట్టణంలో జరిగింది. దేవళంవీధిలోని ఉమ్మర్ మసీదు సమీపంలో నివసిస్తున్న సయ్యద్ జాఫర్‌హుస్సేన్(70)కు భార్య ఫామిదా, కుమారులు జాకీర్ హుస్సేన్, షాకీర్ హుస్సేన్, జావీద్ హుస్సేన్‌లు ఉన్నారు. జాకీర్‌హుస్సేన్ కువైట్‌లో స్థిరపడగా, షాకీర్, జావీద్‌లు ముంబైలో ఉంటున్నారు. భార్య ఫామిదా ముంబైలో కుమారుల వద్దే ఉంటోంది. అయితే, జాఫర్‌హుస్సేన్ వారివద్ద ఉండేందుకు ఇష్టపడకుండా, మదనపల్లెలోని స్వగృహంలోని కింది పోర్షన్ అద్దెకు ఇచ్చి పై పోర్షన్‌లో ఒంటరిగా నివసిస్తున్నాడు. వారంరోజుల క్రితం భార్య ఫామిదా ముంబై నుంచి మదనపల్లెకు వచ్చింది. తనతోపాటు పిల్లల వద్దకు వచ్చేయాలని భర్తను కోరింది. పోతబోలులోని తండ్రి అనారోగ్యానికి గురికావడంతో ఆయనను చూసేందుకు ఆమె అక్కడకు వెళ్లింది. ఈ క్రమంలో జాఫర్‌హుస్సేన్ ఆదివారం తెల్లవారుజామున జీవితంపై విరక్తి చెంది మనస్తాపంతో తాను నివసిస్తున్న ఇంటిలోని గ్రిల్ ఫ్రేమ్‌కు తాడుతో ఉరివేసుకుని వీధివైపుగా దూకాడు. ఇంటికి వేలాడుతూ ఉండగా, ఉదయాన్నే స్థానికులు గుర్తించి వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ అన్సర్‌బాషా సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందకు దించి ఆత్మహత్యకు గల కారణాలను విచారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. భార్య ఫామిదా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వైద్య ఉద్యోగుల సమస్యల సాధనకు ఉద్యమం



మాట్లాడుతున్న ఆస్కార్‌రావు

కడప రూరల్ : వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పలు దఫాలుగా ప్రభుత్వానికి వినతి పత్రాలు సమర్పించాం. అయినప్పటికీ ప్రభుత్వంలో ఎలాంటి కదలిక లేదు. దీంతో ఆందోళన కార్యక్రమాలు, సమ్మె ద్వారా హక్కులను సాధించుకోవడానికి సిద్ధపడుతున్నట్లు పబ్లిక్ హెల్త్ మెడికల్ ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షుడు ఆస్కార్ రావు అన్నారు. ఆదివారం స్థానిక కింగ్స్ ఫంక్షన్ హాలులో ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం (పీహెచ్ఎంఈయూ) జిల్లా, జోనల్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆస్కార్‌రావు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో పనిచేసే ఉద్యోగులకు ఇతర శాఖల విధులు ఆటంకంగా మారాయన్నారు. సమస్యలు పరిష్కారం కాకపోతే సమ్మె ద్వారా హక్కులను సాధించుకుంటామన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆహారోన్ మాట్లాడుతూ తాము ప్రభుత్వం ముందు ఉంచిన సమస్యలన్నీ ఆర్థికేతర అంశాలేనని తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక..

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా ఎర్రపురెడ్డి శ్రీనివాసులురెడ్డి, కార్యదర్శిగా ఎస్ఎండీ మహబూబ్‌బాషా, కోశాధికారిగా జనార్దన్‌బాబు, ఉపాధ్యక్షుడిగా సుధాకర్ బాబు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కలకడలో పేలిన ఐపీ బాంబ్

కలకడ : వ్యవసాయం సాగుకు తీసుకున్న అప్పు పంట నష్టం రావడంతో చెల్లించలేకపోయానని ఓ వ్యక్తి ఐపీ దాఖలు చేసిన సంఘటన కలకడ మండలంలో జరిగింది. బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కలకడ మండలం, గుడిబండ పంచాయతీ గొళ్లపల్లెకు చెందిన బైనమాని నాగరాజ, అతని భార్య అరుణ పీలేరు కోర్టులో రూ.21లక్షలకు ఐపీ దాఖలు చేసిన నోటీసులు పంపినట్లు బాధితులు తెలిపారు. కష్టపడి కూడబెట్టుకున్న డబ్బు సాధారణ వడ్డీకి ఇస్తే ఇలా ఐపీ నోటీసులు పంపడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడు

కురబలకోట : మండలంలోని కంటేవారిపల్లె వద్ద బి.కొత్తకోట కస్పా జయశ్రీకాలనీకి చెందిన నరసింహులు (19) శనివారం రాత్రి లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇతను బెంగళూరులో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం వ్యక్తిగత పనిపై మండలంలోని చింతయ్యగారికోటకు వచ్చాడు. అక్కడ అమ్మమ్మతో మాట్లాడిన అనంతరం తిరిగి స్వగ్రామానికి మోటార్ సైకిల్‌పై వెళుతుండగా లారీ ఢీకొనడంతో మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి



ఈతకు వెళ్లి మృతి చెందిన విద్యార్థి భాస్కర

పెద్దమండ్యం : స్నేహితుని ఊరిలో జరిగే జాతర కోసం వచ్చి సరదాగా ఈతకు వెళ్లిన ఓ విద్యార్థి మృతి చెందాడు. మండలంలోని కలిచెర్లలో ఆదివారం ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కలిచెర్లకు చెందిన అరవింద్ ఇటీవల జరిగిన పదవ తరగతి పరీక్షలు రాసి మదనపల్లెలోని ఓ కోచింగ్ సెంటర్‌లో పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష కోసం కోచింగ్ తీసుకునేందుకు వెళ్లాడు. అక్కడ పెద్దతిప్పసముద్రం మండలం బూర్లపల్లె గ్రామం పిడుమువారిపల్లెకు చెందిన రెడ్డెప్ప కుమారుడు భాస్కర (15), అలాగే తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెకు చెందిన జయప్రకాష్‌రెడ్డితో అరవింద్‌కు స్నేహం కుదిరింది. ఈ నేపథ్యంలో కలిచెర్లలో శుక్రవారం నుంచి పోలేరమ్మతల్లి జాతర ఉండడంతో ముగ్గురు స్నేహితులు కలిచెర్లకు వచ్చారు. ఆదివారం మధ్యాహ్నం సరదాగా ఈత కొట్టేందుకు సమీపంలో బండ కాడచెరువు వద్దకు వెళ్లారు. ఈత కొడుతుండగా నీరు లోతుగా ఉన్న ప్రాంతానికి వెళ్లిన భాస్కర హఠాత్తుగా నీటిలో మునిగి పోవడం గమనించిన స్నేహితులు కలిచెర్లలో ఉన్న బంధువులకు సమాచారం ఇచ్చారు. నీటిలో మునిగిపోయిన విద్యార్థిని యువకులు గుర్తించి బయటకు తీసి హుటాహుటిన కలిచెర్లలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయితే విద్యార్థి అప్పటికే మృతి చెందినట్లు ఆర్ఎంపీ డాక్టర్ తెలిపారు. ఘటనపై మృతుని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పీవీ రమణ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

అధికార దర్పం ప్రదర్శిస్తే సహించేది లేదు

మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వ్యాఖ్యలపై వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్. రమేష్ కుమార్ రెడ్డి ఆగ్రహం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్.రమేష్ కుమార్ రెడ్డి

రాయచోటి : అధికార పార్టీ దర్పంతో మంత్రి హోదాలో ఏం మాట్లాడినా చెల్లుతుందన్నట్లుగా రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడడంపై వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్. రమేష్ కుమార్ రెడ్డి భగ్గుమన్నారు. ఆదివారం రాయచోటిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ రహదారి పనికోసం నిల్వ ఉంచిన కంకర, సామగ్రిని దొంగిలించడంపై మండలించాల్సిన మంత్రి తన పేరు చెప్పుకొని ఎవరైనా తీసుకెళ్తే తాను దొంగతనం చేసినట్లా అని మాట్లాడడం దారుణమన్నారు. ఇలా ఇయితే మంత్రి పేరు చెప్పుకొని ఎవరైనా దర్జాగా దొంగతనాలు చేయొచ్చా? అని మంత్రిని నిలదీశారు. తాను ఎన్నికల సమయంలో కోట్ల రూపాయలు తీసుకొని వైఎస్సార్‌సీపీలోకి వచ్చినట్లు చేసిన ఆరోపణలపై వీరభద్రస్వామి దేవస్థానంలో ప్రమాణానికి సిద్ధమన్నారు. చంద్రబాబు నాయుడు తనకు టికెట్టు ఇవ్వకుండా ద్రోహం చేశారని, అందుకే పార్టీలో ఉండనని ఆయనకే చెప్పి బయటకు వచ్చానన్నారు. కడపలో తన కుటుంబ సభ్యులకు వ్యతిరేకంగా ఎన్నికల్లో ప్రచారం చేసిన విషయం జిల్లా ప్రజలకు తెలుసన్నారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీలో ఉండి ఆ పార్టీకి నమ్మక ద్రోహం చేసి వైఎస్సార్‌సీపీని ఓడించడానికి టీడీపీ నుంచి రూ. 40 లక్షలు వసూలు చేసిన నీచ చరిత్ర మండిపల్లిది అని ధ్వజమెత్తారు.

జాతీయ రహదారి పనులు నా పేరున లేదంటావా? పనిచేసేందుకు అన్ని అర్హతలు ఉన్న ఒప్పంద పత్రం ఇదిగో చూడండని మంత్రికి సవాల్ విసిరారు.

తనను రాయచోటిలో తిరగనివ్వకుండా చేస్తానన్న మంత్రి మాటలపై రమేష్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. నీలాంటి వారు వందమంది వచ్చినా తనను అడ్డుకోవడం సాధ్యం కాదంటూ హెచ్చరించారు. మూడుసార్లు ఎన్నికల్లో పోటీచేస్తే రెండుసార్లు డిపాజిట్ కూడా దక్కించుకోలేని విషయాన్ని మరచిపోయావా అంటూ ఎద్దేవా చేశారు. సమావేశంలో నియోజకవర్గంలోని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఫెయిల్ అయ్యామని ముగ్గురు విద్యార్థుల ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : రాష్ట్ర ప్రభుత్వం శనివారం విడుదల చేసిన ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో ఫెయిల్ అయిన ముగ్గురు విద్యార్థులు మనస్తాపంతో ఆత్మహత్యకు ప్రయత్నించి, స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని(16) పరీక్షలో గణితం సబ్జెక్టులో ఫెయిల్ అయింది. మనస్తాపంతో విష ద్రావణం తాగింది. గుర్రంకొండ మండలం నడిమికండ్రిగకు చెందిన విద్యార్థి(16) మదనపల్లెలో ఉంటూ జెడ్పీ హైస్కూల్‌లో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. ఫలితాల్లో అన్ని సబ్జెక్టుల్లో ఫెయిల్ కావడంతో మనస్తాపం చెంది పురుగుమందు తాగాడు. నీరుగట్టువారిపల్లెకు చెందిన ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం విద్యార్థి(18) పరీక్షలో ఫెయిల్ కావడంతో నిద్రమాత్రలు మింగాడు. ఆయా ఘటనల్లో గమనించిన కుటుంబ సభ్యులు బాధితులను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

మెడికల్ ఏజెన్సీలో చోరీ

కడప అర్బన్ : కడప నగరం బీకేఎం వీధిలో ఈశ్వర్ మెడికల్ ఏజెన్సీలో గుర్తుతెలియని దొంగలు జొరబడి నగదును అపహరించినట్లు కడప టూ టౌన్ ఎస్ఐ ఎస్‌కేఎం హుస్సేన్ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు కడపకు చెందిన శివకుమార్ ఈనెల 11వ తేదీ రాత్రి తమ ఏజెన్సీ మూసుకొని ఇంటికి వెళ్లాడు. తిరిగి ఉదయం వచ్చి చూసేసరికి తమ ఏజెన్సీ షట్టర్ పగలగొట్టి దొంగలు చొరబడి రూ.1.21 లక్షల నగదును అపహరించినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎస్‌బీఐలో చోరీ

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండలంలోని కొత్త రోడ్డులోగల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఈ ఘటనలో 30 వేల రూపాయలు నగదు, సీసీ కెమెరాలకు సంబంధించిన డీవీఆర్ బాక్స్‌ను దొంగిలించినట్లు సమాచారం. సీఐ కృష్ణారెడ్డి ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కారు ఢీకొని బాలుడికి గాయాలు



బద్వేలు అర్బన్ : పట్టణంలోని నెల్లూరు రోడ్డు నుంచి శివాలయంకు వెళ్లే రోడ్డులో ఆదివారం కారు ఢీకొన్న ఘటనలో ఓ బాలుడికి గాయాలయ్యాయి. పట్టణంలోని గౌరీశంకర్ నగర్‌కు చెందిన రాజు, క్రిష్ణవేణిల కుమారుడైన గుర్రాల వెంకటనాగేష్ (11) శివాలయం రోడ్డు నుంచి నెల్లూరు రోడ్డు వైపు వస్తుండగా ప్రొద్దుటూరు నుంచి నెల్లూరు వైపు వెళుతున్న కారు ఢీకొనడంతో ఎడమ కాలు విరిగింది.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ

- మహిళ మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన షేక్ గులాబ్‌జాన్

రామాపురం : రామాపురం మండలం బండపల్లె గ్రామం వీఆర్ పాఠశాల సమీపంలో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు రామాపురం మండల వెంకటరెడ్డిగారిపల్లెకు చెందిన షేక్ గౌస్‌మొహిద్దీన్, అతని భార్య షేక్ గులాబ్‌జాన్, కుమారుడు మహమ్మద్ అనాస్‌లు రాయచోటికి వెళ్లి తిరిగి స్వగృహానికి ఏపీ04ఏబి 3151 ఎక్సెల్ ద్విచక్రవాహనంలో వస్తుండగా మార్గమధ్యంలో పెట్రోల్ బంక్ (వీఆర్ పాఠశాల) సమీపంలోకి రాగానే రాయచోటి వైపు నుంచి కడపకు వెళ్తున్న రాయల్ ఎన్‌ఫీల్డ్ ఏపీ40 ఎఫ్‌సీ 7187 వాహనం అతి వేగంగా, అజాగ్రత్తగా, హారన్ కొట్టకుండా వచ్చి ముందు వెళ్తున్న ఎక్సెల్‌ను బలంగా ఢీకొంది. అందులో ప్రయాణిస్తున్న షేక్ గౌస్‌మొహిద్దీన్, గులాబ్‌జాన్, మహమ్మద్ అనాస్‌లు రోడ్డుపై పడడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న మండల ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. షేక్ గులాబ్‌జాన్ పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కడపకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘర్షణకు దారి తీసిన ఇడ్లీ రేటు

పరస్పరం పోలీసులకు ఫిర్యాదు

కురబలకోట : టిఫిన్ బండి వద్ద తలెత్తిన చిన్న వివాదం ఘర్షణతో పాటు పరస్పర దాడులకు దారి తీసిన ఆసక్తికర సంఘటన మండలంలోని అంగళ్లలో జరిగింది. పోలీసులకు అందిన ఇరువర్గాల ఫిర్యాదు మేరకు...అంగళ్లకు చెందిన వ్యక్తి (55) పక్క రాష్ట్రంలో హైకోర్టు లాయర్‌గా ఉన్నారు. ఆపై ఆ రాష్ట్ర హైకోర్టు లోక్ అదాలత్ జడ్జిగా కూడా కొనసాగుతున్నారు. ఇతను కొంత కాలంగా స్వగ్రామం అంగళ్లలో ఉంటున్నారు. శనివారం ఉదయం టిఫిన్ కోసం అంగళ్లలోని ఓ టిఫిన్ బండి వద్దకు వెళ్లారు. అక్కడ రెండు ఇడ్లీలు తిని ఎంత ఇవ్వాలి అని అడిగారు. రూ. 15 ఇవ్వాలని టిఫిన్ బండి నిర్వహిస్తున్న మహిళ చెప్పారు. ఇంత రేటు ఎందుకని ప్రశ్నించాడు. దీంతో ఇరువురి మధ్య మాటామాటా పెరగడంతో వాగ్వాదానికి దారితీసింది. ఆవేశంలో పరస్పరం చేయి కూడా చేసుకున్నారు. ఆపై ఒకరిపై ఒకరు దాడులకు దిగారు. ఇది కాస్తా ఉద్రిక్త పరిస్థితులకు దారి తీసింది. తర్వాత తమపై దాడి చేశారని పరస్పరం ముదివేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఆదివారం రూరల్ సర్కిల్ సీఐ సత్యనారాయణ విచారణ జరిపారు. బాధితురాలు తొలుత ఓ రాజకీయ పార్టీ ప్రమేయంతో దాడి జరిగినట్లు ఆదివారం మీడియాతో చెప్పింది. దీంతో ఇది కాస్తా రాజకీయ రంగు పులుముకున్నట్లయింది. దీంతో ఆ పార్టీ వారు అప్రమత్తమై ఈ విషయాన్ని రూరల్ సర్కిల్ సీఐ దృష్టికి తీసుకెళ్లారు. పోలీసుల విచారణలో టిఫిన్ బండి నిర్వాహకురాలిపై దాడి వెనుక ఓ రాజకీయ పార్టీ ప్రమేయం లేదని వెల్లడైంది. దాడి వెనుక ఆ పార్టీ నాయకుల ప్రమేయం లేదని పొరపాటున చెప్పానని ఇది వ్యక్తిగతంగా జరిగిన గొడవ అని టిఫిన్ సెంటర్ నిర్వాహకురాలు మళ్లీ మీడియాకు వెల్లడించారు. ఇదిలా ఉండగా టిఫిన్ బండి వద్ద క్షణికావేశంలో జరిగిన ఈ సంఘటన చర్చనీయాంశంగా మారింది.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలి మృతి

భర్త, కుమార్తెకు తీవ్ర గాయాలు



శారద (ఫైల్)



గాయపడిన ఉపాధ్యాయుడు వెంకటరమణ, కుమార్తె కీర్తి

కలకడ : మదనపల్లె వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో కలకడ మండలం, బాలయ్యగారిపల్లె పంచాయతీ యర్రయ్యగారిపల్లెకు చెందిన ఉపాధ్యాయురాలు శారద (40) మృతి చెందారు. ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఆమె భర్త వై.వెంకటరమణ, కుమార్తె కీర్తితో కలిసి మదనపల్లెకు కారులో వెళుతుండగా సుగాలిమిట్ట వద్ద లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ముగ్గురిని మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించి శారద మృతి చెందారు. ఆమె భర్త వెంకటరమణ, కుమార్తె కీర్తిని బెంగళూరు ఆసుపత్రికి తరలించారు. ఉపాధ్యాయ దంపతులిద్దరూ గ్రామస్తులతో సన్నిహితంగా ఉండేవారు. ఆదివారం రాత్రి శారద మృతదేహం యర్రయ్యగారిపల్లెకు చేరుకోగానే గ్రామం శోకసంద్రమైంది.

అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్ కెమెరాలతో నిఘా



డ్రోన్ కెమెరాతో అసాంఘిక కార్యకలాపాలను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించడానికి ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో ఆదివారం ఫ్యాక్షన్ జోన్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు పరిశీలించారు. గంజాయి విక్రయాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా నిరోధించేందుకు పోలీసులు ముమ్మర చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఎర్రగుంట్ల రోడ్డు, పాల కేంద్రం, పెన్నానది పరివాహక ప్రాంతం, చిన్నశెట్టిపల్లె రోడ్డు, అమృతానగర్, పెద్దశెట్టిపల్లె గ్రామ పరిసరాల్లో డ్రోన్ కెమెరాలతో జల్లెడ పట్టి అనుమానాస్పదంగా సంచరించే వారిని గుర్తించే చర్యలు చేపట్టారు.

ఆటో ఢీకొని ద్విచక్రవాహనదారుడికి గాయాలు

ముద్దనూరు : మండలంలోని డీయస్‌పల్లె గ్రామ సమీపంలో ఆదివారం ఆటో ఢీకొని ద్విచక్రవాహనదారుడు నందకిషోర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు కొసినేపల్లె గ్రామానికి చెందిన కిషోర్ ముద్దనూరుకు మోటార్‌బైక్‌పై వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ఘటనలో కిషోర్ కాలికి తీవ్ర గాయం కాగా అతన్ని 108 వాహనంలో ప్రొద్దుటూరుకు తరలించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

- హత్యగా భావిస్తున్న పోలీసులు
- మృతదేహాన్ని పరిశీలించిన డీఎస్పీ



కాలిన శరీరంతో మృతి చెంది ఉన్న రామయ్య



రోదిస్తున్న మృతుడి బంధువులు

వేంపల్లె : వేంపల్లె మండలం నందిపల్లె గ్రామ సమీపంలో కమలాపురం నియోజకవర్గంలోని వల్లూరు మండలం పైడి కాలువ పంచాయతీ సీతోరుపల్లె గ్రామానికి చెందిన పంగా రామయ్య (21)అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఆదివారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. వల్లూరు మండలానికి చెందిన పంగా వీరయ్య కుమారుడు పంగా రామయ్య కూలి పనులు చేసుకొనేవాడు. అయితే నందిపల్లి గ్రామ సమీపంలో కాలిన గాయాలతో రామకృష్ణారెడ్డి అరటి తోట వద్ద పడి ఉండడంతో అరటి తోట వద్దకు పనికి వెళ్లిన లక్ష్మీదేవి అనే మహిళ చూసి స్థానికులకు, పోలీసులకు సమాచారం ఇచ్చింది. దీంతో కొన ఊపిరితో ఉన్న రామయ్యను వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ మేరకు పులివెందుల డీఎస్పీ మురళి నాయక్, సీఐలు నరసింహులు, చాంద్ బాషా ఘటన స్థలాన్ని పరిశీలించారు. అలాగే మృతుని తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పులివెందుల డీఎస్పీ మురళి నాయక్ విలేకరులతో మాట్లాడుతూ పొలం పనులకు వెళ్లిన లక్ష్మీదేవి గమనించి రైతు రామకృష్ణారెడ్డికి సమాచారం ఇచ్చిందన్నారు. ఆయనతోపాటు నందిపల్లె గ్రామస్తులు కొందరు అక్కడికి వెళ్లి కాలిన గాయాలతో పడి ఉన్న యువకుడిని విచారించగా ముందు నీళ్లు ఇవ్వండి నేను మాట్లాడతానని చెప్పినట్లు తెలిపారు. అలాగే నీళ్లు తాగి మా నాన్న పేరు వీరయ్య అని చెప్పి ఫోన్ నెంబర్ ఇచ్చినట్లు చెప్పారు. సమాచారం అందుకున్న పోలీసులు రామయ్యను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని తెలిపారు. ఘటన స్థలంలో రామయ్యపై పెట్రోల్ కాని కిరోసిన్ కాని వేసి కాల్చిన ఆనవాళ్లు కనిపించలేదని చెప్పారు. వేరే ప్రాంతంలో కాల్చి రాత్రి సమయంలో నందిపల్లె ప్రాంతానికి తీసుకొని వచ్చి పడేసినట్లు ఉందన్నారు. రామయ్యది హత్య కేసుగానే భావిస్తున్నామన్నారు. వల్లూరు మండలంలో సీతోలుపల్లె నుంచి వీఎస్ పల్లెలో ఉన్న అక్క ఇంటికి భోజనానికి వెళుతున్నానని ఇంటిలో చెప్పి వెళ్లినట్లు తెలిసిందని చెప్పారు. సీతోలుపల్లె నుంచి వీఎస్ పల్లెకు వెళ్లలేదని తెలిపారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ పేర్కొన్నారు.